
> అనెస్తటిస్ట్ మనోగతంలోంచి మన సమాజంలోని ఒక దురాచారాన్ని బలంగా వ్యక్తీకరించిన కథ ఇది. అనెస్తటిస్ట్ జీవితాన్ని, అతని అంతరంగ ప్రపంచాన్ని రేఖమాత్రంగా వ్యక్తం చేస్తూ తెలుగుసాహిత్యంలో వచ్చిన తొలి కథ కూడా ఇదే కావడం విశేషం!!

# అనెస్థీషియా





చిమ్మని మనోహర్

"ఎమర్జన్సీ సిజేరియన్ పోస్టెడ్. ప్లీజ్ కాంటాక్ట్ నిర్మల నర్సింగ్ హోమ్."

'రోహిణి'లో అప్పుడే ఒక ఆపరేషన్‌కు అటెండయి బయటకు వస్తున్నాను. ఇంతలో మరో ఆపరేషన్ కోసం పేజర్ మెసేజ్! కొద్దిగా విసుగనిపించింది. కాని తప్పదు. ఎన్నుకున్న వృత్తి అటువంటిది. అనెస్తిటిస్ట్ లైఫ్ అంటే ఇలాగే వుంటుంది.

తెల్లవారుజామున నాలుగు గంటలకు లేచినప్పటినుంచి ఆరు ఆపరేషన్లు అటెండయ్యాను. మధ్యలో ఒకసారి పదకొండు గంటలప్పుడు కొద్దిగా గ్యాప్ దొరికింది. ఇంటికెళ్తే ఆలస్యమవుతుందని 'రత్న'లో కూర్చుని టిఫిన్ ఆర్డర్ చేశాను. వెంటనే మరో పేజర్ మెసేజ్! ఇక చేసేదేం లేక అదే టిఫిన్‌ను పార్శెల్ చేయించుకుని బయటపడ్డాను. టిఫిన్ తిని, తీరిగ్గా మరో పావుగంట ఆలస్యంగా వెళ్ళినా ఏం కాదు. కాని, అక్కడ హాస్పిటల్లో డాక్టర్లు అంతా సిద్ధం చేసుకుని నా కోసం ఎదురుచూస్తూ వుండే పరిస్థితి నాకెందుకో నచ్చదు. అన్నిటినీ మించి, 'పేషెంట్ కండిషన్ సీరియస్‌గా వుండేమో'ననే ఆందోళన నన్నెప్పుడూ వెంటాడుతూ వుంటుంది.

ఇవన్నీ ఒక ఎత్తు. ఇతర డాక్టర్ల నమ్మకాన్ని కోల్పోకుండా కాపాడుకోవడం మరోఎత్తు. ఆపరేషన్ అటెండవుతానని చెప్పి వెళ్ళకపోయినా, మరీ ఆలస్యం చేసినా బావుండదు. ఒకటి రెండు సార్లు చూసి- 'ఈయనతో లాభం లేద'ని మరో అనెస్టటిస్ట్‌ని చూసుకొంటారు. కొంతమంది డాక్టర్లకు అనెస్తటిస్ట్‌లంటే అదోరకమైన ఫీలింగ్ వుంటుంది. వూరికే అలావచ్చి, ఇలా డబ్బులు జేబులేసుకు వెళ్తారనీ, బాగా సంపాదిస్తారనీ! ఇటువంటివాళ్ళంతా 'ఛాన్స్' కోసం ఎదురుచూస్తుంటారు. వృత్తిలో సక్సెస్‌ఫుల్‌గా నిలదొక్కుకుని వుండాలంటే ఈ తలనొప్పులన్నిటినీ బ్యాలెన్స్ చేసుకుంటూ పోవాల్సివుంటుంది.

నిజానికి అనెస్తటిస్ట్ అంటే- అందరూ అనుకునేట్టు ఇలావచ్చి, అలా వెళ్ళిపోయే 'మత్తుమందు డాక్టర్' కానేకాదు. చేస్తున్న ఆపరేషన్‌ను బట్టి, పేషెంట్ కండిషన్‌ను బట్టి, అతని శారీరకతత్వాన్ని బట్టి ఏరకమైన అనెస్థీషియా ఇవ్వాలో అనెస్తటిస్ట్ అప్పటికప్పుడు క్షణాల మీద నిర్ణయం తీసుకోవాల్సివుంటుంది. ఆపరేషన్ ప్రారంభానికి ముందునుంచి పూర్తయ్యేవరకూ పేషెంటుకు నొప్పి తెలీకుండా చేయటంతోపాటు- ఆపరేషన్ పూర్తయ్యి పేషెంటు స్పృహలోకి వచ్చేవరకూ అనెస్తటిస్ట్‌దే బాధ్యత.

ఆలోచిస్తూనే కార్లో కూర్చున్నాను. కలెక్టరేట్ నుంచి మండిబజార్ వెళ్ళాలంటే ఎంతలేదన్నా ఇరవైనిమిషాలు పడుతుంది. రోడ్డు మీద ట్రాఫిక్‌రూల్స్‌ని అంతగా పట్టించుకోని వాహనాల్నీ, రోడ్డుకి అడ్డంగా చాలా తాపీగా నడిచే జనాన్నీ గమనిస్తూ నెమ్మదిగా డ్రైవ్ చేస్తున్నాను. ఎల్.బి.కాలేజి దాటుతుండగా పేజర్లో రిమైండర్ మెసేజ్ వచ్చింది.

'వస్తున్నా'నంటూ బయల్దేరే ముందే ఒక ఫోన్ చేయాల్సింది... మర్చిపోయాను. అక్కడ నర్సింగ్‌హోమ్‌లో డాక్టర్ కంగారుపడుతూ వుంటుంది. యాక్సిలేటర్‌ని మరింత ప్రెస్ చేశాను. కారు మరింత వేగం అందుకుంది.

అయిదు నిమిషాల తర్వాత కారుని నర్సింగ్‌హోమ్ ముందు పార్క్ చేసి లోపలికి వెళ్ళాను.

"ఎవ్విరిథింగ్ ఈజ్ రెడీ డాక్టర్! ప్రైమీ కేస్, ఫీటల్ డిస్ట్రెస్..." అంటూ పేషెంట్ కండిషన్ గురించి క్లుప్తంగా చెప్పేసి డాక్టర్ ఆపరేషన్ థియేటర్లోకి వెళ్ళింది.

ఆపరేషన్ థియేటర్‌ను ఆనుకునే వున్న రెస్టరూమ్‌లో గబగబా డ్రస్ మార్చుకున్నాను. అటునుంచి థియేటర్‌లోపలికి వెళ్ళి అనెస్థీషియా మెషిన్ (బాయిల్స్ అపరేటస్), లారింగో స్కోప్, ఎండోట్రేకియల్ ట్యూబ్స్, ఎమర్జన్సీ మెడిసిన్స్... అన్నిటినీ ఒకసారి చెక్ చేసుకున్నాను. తర్వాత బయట యాంటీరూమ్‌లో వున్న పేషెంట్ దగ్గరకొచ్చాను.

పేషెంట్ తాలూకు బంధువు కావచ్చు - ఒక యువతి అక్కడవున్న స్టూల్ మీద కూర్చునివుంది. నన్ను చూడగానే గబుక్కున లేచి నిల్చుంది.

నర్స్ అందించిన ఇన్వెస్టిగేషన్ ఫైల్ చూస్తూ పేషెంట్‌ను టెస్ట్ చేయటం ప్రారంభించాను. పేషెంట్‌కి ఇరవై ఏళ్ళు. తెల్లగా, బొద్దుగా, ఆరోగ్యంగా వుంది.

"పేరేంటమ్మా?" పల్స్ చూస్తూ అడిగాను.

"లక్ష్మి" విన్పించీ విన్పించనట్లు వినిపించింది. ఆపరేషన్ భయంతో అనుకుంటాను- ఆ అమ్మాయి నోటినుంచి మాట బయటకు రావటంలేదు.

"ఇంతకుముందు ఏదయినా ఆపరేషన్ జరిగిందా నీకు?"

నిజంగానే ఆ అమ్మాయి భయంతో వణుకుతోంది. సమాధానం చెప్పడానికి విఫలయత్నం చేస్తూ ఆ అమ్మాయి పెదాలు కదిలాయి. కాని, ఈసారి కొద్దిగానైనా మాట బయటికి వినిపించలేదు.

"చూడమ్మా! అంత భయపడాల్సిందేమీలేదు. ఇదొక మామూలు ఆపరేషన్! నేనడిగేవాటికి నువ్వు సమాధానం చెప్పాలి..." అనునయంగా చెప్పాను.

అంత భయంలోనూ స్టూలుపక్కనే గోడకు ఆనుకుని నిల్చున్న యువతికేసి 'నువ్వు చెప్పొచ్చుగా' అన్నట్టు ఉరిమి చూసిందా అమ్మాయి.

ఒక్క వుదుటున ముందుకు వచ్చిందా యువతి. "ఇ... ఇంతకుముందు ఏ ఆపరేషనూ జరగలేదండి..." చెప్పిందామె తడబడుతూ.

నాకు నవ్వొచ్చింది. తనకంటే కనీసం పదేళ్ళయినా చిన్నదయిన ఆ అమ్మాయికి తను అంతలా భయపడాల్సిన అవసరమేంటో నాకర్థం కాలేదు.

"ఈ అమ్మాయి నీకేమవుతుంది?" పేషెంట్‌ని చూపిస్తూ ఆ యువతినడిగాను.

"చె... చెల్లెలు"

"ఈమెకెప్పుడయినా జబ్బు చేసిందా? అంటే ... ఫిట్స్ రావడంగానీ, ఛాతీనొప్పిగానీ..."

"ఏ అనారోగ్యమూ లేదండి" చెప్పిందామె.

తర్వాత మరికొన్ని వివరాలు అడిగి కనుక్కున్నాను. పేషెంటుకు అనెస్థీషియా ఇచ్చేముందు ఇవన్నీ కనుక్కోవడం అవసరం. లేకపోతే అనెస్థీషియా ఇచ్చాక ఆపరేషన్ మధ్యలో లేనిపోని సమస్యలు రావచ్చు. స్పైనల్ అనెస్థీషియా ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్నాను. పేషెంటుని ఆపరేషన్ థియేటర్లోకి తీసుకెళ్ళారు. వెనకే నేనూ వెళ్ళాను.

ఆపరేషన్ పూర్తయ్యేటప్పటికి సుమారు నలభై నిమిషాలు పట్టింది. అదృష్టవశాత్తు ఆపరేషన్ మధ్యలో బ్రాడీకార్డియా, హైపోటెన్షన్ వంటి ఏ సమస్యలూ రాలేదు. అసిస్టెంట్‌ను చూస్తూండమని చెప్పి రిలాక్స్ కోసం ఆపరేషన్ థియేటర్లోంచి కాసేపు బయటికి

వచ్చాను.

ఎదురుగా యాంటీరూమ్‌లో ఒక మూలన గోడకు ఆనుకుని అలాగే నిల్చుని వుందా యువతి. ఈసారి ఆ యువతిని పరిశీలనగా చూశాను. సుమారు ముప్ఫైఏళ్ళు వుంటాయనుకుంటాను. చామనఛాయలో వున్న నుదుటి మీద ఎర్రటి 'బిందీ' కొట్టొచ్చినట్టుగా కన్పిస్తోంది. కొద్దిగా రేగిన జుట్టుతో. భుజాలనిండుగా కొంగుకప్పుకుని, ముఖంలో ఏ భావమూ లేకుండా నిల్చున్న ఆ యువతిని చూస్తోంటే 'చక్ర'లో స్మితాపాటిల్ గుర్తుకొచ్చింది.

"మీ చెల్లెలికేం ఫరవాలేదమ్మా! ఆపరేషన్ బాగానే జరిగింది... అబ్బాయి!" కుర్చీలో రిలాక్స్‌డ్‌గా కూర్చుంటూ చెప్పాను.

"నర్స్ చెప్పిందండి" కిందకి చూస్తూ అందామె. నిర్లిప్తంగావున్న ఆమె ముఖంలో ఏ మార్పూ లేదు! కొద్దిగా ఆశ్చర్యపోయాను.

"మీ చెల్లెలు భర్త, మీ వాళ్ళు... ఇంకెవరూ రాలేదా?"

"వచ్చారు... అంతా బయట వరండాలో వున్నారు."

హాస్పిటల్స్‌లో ఎప్పుడయినా గ్యాప్ దొరికితే పేషెంట్లతోను, వాళ్ళ తరపు వ్యక్తులతోను కలుపుగోలుగా మాట్లాడ్డం, వారి మంచిచెడులను కనుక్కోవడం నాకు మొదటినుంచీ అలవాటు. ఈ అలవాటు బహుశా నేను మధ్యతరగతి కుటుంబం నుంచి రావడంవల్ల వచ్చింది కావచ్చు.

"సొంత చెల్లెలా?" మళ్ళీ అడిగాను.

"అహ... వరసకి... చెల్లెల్లాంటిదే" తడబడిందామె.

"అంటే - పిన్ని కుతురా?"

జవాబివ్వడానికి కొన్ని క్షణాలు సందేహించిందామె. తర్వాత నెమ్మదిగా అంది- "ఆయనకు... రెండో భార్య."

రిలాక్స్‌డ్‌గా కుర్చీలో కూర్చుని, నా మామూలు ధోరణిలో మాట్లాడుతున్న వాడినల్లా ఆమె చెప్పిన జవాబు విని ఒక్కసారిగా షాక్ తిన్నాను. అప్పటివరకూ సమాంతరంగా నా మనసులో మెదలుతున్న ఆపరేషన్లు, అనెస్తీషియా గొడవల ఆలోచనలు చెల్లాచెదురైపోయాయి.

ఆ షాక్ నుంచి తేరుకోడానికి నాకు ఐదు నిమిషాలపైనే పట్టింది. ఆమెవైపు చూశాను.

ఏ భావమూ లేని అదే ముఖం. విచారం లేదు, ఆనందం లేదు. కిందకు చూస్తూ అలాగే గోడకు ఆనుకుని నిల్చుని వుంది.

"రెండోపెళ్ళి ఎందుకు చేసుకున్నాడు... మీకు పిల్లల్లేరా?" ఈ దేశంలో ఒక మగాడు రెండోపెళ్ళి చేసుకోడానికి చూపించే మొట్టమొదటి ప్రామాణిక కారణం ఇదే కాబట్టి అడిగాను.

"వున్నారు... ముగ్గురు పిల్లలు"

"మరి?"

"ముగ్గురూ ఆడపిల్లలే!" మొదటిసారిగా ఆమె గొంతులో జీర ధ్వనించింది.

అప్పటివరకూ నాకు స్ఫురించని ఈ రెండో హేయమైన కారణం విన్నాక నా మనసంతా పాడయిపోయింది.

రెండో భార్యకి కొడుకే పుడతాడన్న గ్యారంటీ ఏదైనా వుందా? అయినా కొడుకులు పుట్టి ఉద్ధరించేది ఏముంది? పుట్టిన ఆడపిల్లల్నే కొడుకుల్లా చూసుకోకూడదా? బాల్యంనుంచి పెళ్ళి చేసుకుని వెళ్ళిపోయేవరకూ తల్లిదండ్రుల పట్ల, ఇంట్లో వాళ్ళందరిపట్ల కూతుళ్ళు చూపే ప్రేమ, ఆర్తి ఎంతమంది కొడుకులకుంటుంది? ఎంతదూరం వెళ్ళినా, ఎక్కడున్నా తమవాళ్ళని తల్చుకుంటూ కూతుళ్ళ కళ్ళు చెమర్చుతాయి, వర్షిస్తాయి. మరి ఎంతమంది కొడుకులు కనీసం వృద్ధాప్యంలో వున్న కన్నతల్లిదండ్రుల బాగోగులను పట్టించుకుంటున్నారు?

"మీ వాళ్ళెవరూ గొడవ చేయలేదా?" మళ్ళీ అడిగాను.

"నా దురదృష్టం అన్నారు... ఆడపిల్లల్ని కన్నందుకు వాళ్ళూ నన్నే తిట్టారు"

"ఎంతవరకు చదువుకున్నావు?"

"...ఎనిమిదో క్లాసు"

'నువ్వెలా ఒప్పుకున్నావు' అని నోటిదాకా వచ్చిన ప్రశ్నను బయటికి అడగలేకపోయాను ఇదంతా విన్న తర్వాత. అంతకంటె తెలివితక్కువ ప్రశ్న మరొకటి వుండదనిపించింది.

"ఏం చేస్తాడు మీ ఆయన?"

"వ్యాపారం వుంది... బట్టల షాపు."

నా మూడ్ పాడయిపోయింది. లేచి మళ్ళీ ఆపరేషన్ థియేటర్లోకి వెళ్ళాను. లోపల పేషెంటును మరోసారి చూసి, పది నిమిషాల్లో డ్రస్ మార్చుకుని బయటకు వచ్చాను.

యాంటీరూమ్‌లో ఆమె అక్కడే అలాగే నిల్చునివుంది. అక్కడినుంచి బయటకు వెళ్ళిపోతూ ఏదో అనుమానం వచ్చి ఆమె ముందు ఒక్క క్షణం ఆగాను. వస్తున్న వెక్కిళ్ళను ఆపుకుంటూ నిశ్శబ్దంగా రోదిస్తోందామె.

తనముందు నిల్చున్న నన్ను తలెత్తి చూసింది. ఆమె కళ్ళనిండా నీళ్ళు.

అంతా తెలిసికూడా 'ఏం జరిగింది' 'ఎందుకేడుస్తున్నావు' అని ఆమెను అడగలేకపోయాను. కాని, ఇప్పటిదాకా ఏమీ జరగనట్టు నిర్లిప్తంగా వున్న ఆమె- వున్నట్టుండి ఎందుకలా ఏడుస్తోందో నాకర్థం కాలేదు.

"ఇప్పుడెందుకమ్మా ఏడుస్తున్నావు?" చివరికి అడగకుండా వుండలేకపోయాను.

ఒక్కసారిగా బావురుమందామె. "ఆడపిల్లల్ని కన్నానని నన్నెన్నో బాధలు పెట్టారు. హింసించారు. చివరికి నా భర్త రెండోపెళ్ళికి నేను వొప్పుకునేవరకూ నన్ను నిద్రపోనివ్వలేదు. అందరితోపాటు నిన్నమొన్న వచ్చిన ఈ అమ్మాయి కూడా నన్ను బానిసకన్నా హీనంగా చూస్తోంది... వాళ్ళంతా కోరుకున్నట్టే ఇప్పుడీ అమ్మాయికి కొడుకు పుట్టాడు. ఇప్పట్నించీ నన్ను ఇంకెంత వేధిస్తారో... ఎన్ని హింసలు పెడతారో..." కొంగు నోటికి అడ్డం పెట్టుకుని వెక్కివెక్కి ఏడవసాగిందామె.

నా గుండెలో ఏ మూలో కలుక్కుమంది. ఆమెకు ఏం చెప్పను? ఎలా ఓదార్చను? అయిదు నిమిషాలపాటు తన కష్టసుఖాల గురించి కనుక్కున్నందుకు నన్నొక ఆత్మీయుడిలా భావించి, తన ఆర్తిని నాకు తెలుపుకొంది. దాపరికం లేకుండా తన దుఖాన్ని నా ముందుంచింది. బదులుగా ఆమెకు నేనేమీ చేయలేకపోవడమనేది నాకే చాలా ఇబ్బందిగా అనిపించింది.

బహుశా నా ఈ ఇబ్బందిని గ్రహించిందేమో- గబగబా కొంగుతో కన్నీళ్ళు తుడ్చుకుందామె. ఎప్పట్లాగే ముఖంలో ఏ భావమూ లేకుండా నిర్లిప్తంగా మారిపోయింది. ఇంక అక్కడవుండలేక వెంటనే అక్కడినుంచి ముందుకు కదిలాను.

వెళ్తూవెళ్తూ ఒకసారి కన్సల్టేషన్ రూమ్‌లోకి తొంగిచూశాను. ఆపరేషన్ థియేటర్‌నుంచి అప్పుడే వచ్చినట్టుంది డాక్టర్. పేషెంట్లను చూడడంలో బిజీగా వుంది.

"డాక్టర్ నేను వెళ్ళొస్తాను!" చెప్పాను.

నా వైపు తిరిగి 'అలాగే' అన్నట్టు తలవూపుతూ నవ్వింది డాక్టర్.

రోజూ ఎంతోమంది పేషెంట్ల బాధల్ని వింటూ, వారి ఆరోగ్యాల్ని బాగు చేస్తున్న ఈ డాక్టర్ ఆడపిల్ల కాదా? కుటుంబసభ్యులు కూడా చేయడానికి అసహ్యించుకునే సేవలను పెదాలపై చిరునవ్వు చెదరకుండా చేస్తున్న ఈ నర్సులంతా ఆడపిల్లలు కారా? లతా మంగేష్కర్‌లూ, కిరణ్ బేడీలు, బచేంద్రిపాల్‌లు, కల్పన చావ్లాలు, సుస్మితాసేన్‌లు... వీళ్ళంతా ఆడపిల్లలు కారా?

హాస్పిటల్లోంచి బయటకు వస్తూండగా కారిడార్లో అంతా సందడిగా కనిపించింది. అక్కడున్న ఏడెనిమిది మంది ముఖాలు ఆనందంతో వెలిగిపోతున్నాయి. సిల్కులాల్చీ పైజామాల్లో సుమారు ముప్ఫై అయిదేళ్ళ వయసున్న ఓ వ్యక్తి తనవాళ్ళకి స్వీట్లు పంచుతున్నాడు. బహుశా అతడే అనుకుంటాను- ఇందాక నేను మాట్లాడిన ఆ యువతి భర్త. వారికి కొంచెం దూరంలో కొండపల్లి బొమ్మల్లా వున్న ముగ్గురు చిన్నారి పాపలు చిన్నచిన్న రాళ్ళతో గచ్చకాయలాట ఆడుకుంటూ వాళ్ళ లోకంలో వాళ్ళున్నారు.

బయటికొచ్చి కార్లో కూర్చున్నాను. గ్లాస్ దించగానే కారిడార్లో స్వీట్లు పంచుతున్న దృశ్యం మళ్ళీ కనిపించింది. అతడు పంచుతున్న స్వీట్లు ఆ క్షణం నాకు స్వీట్లలా కనిపించలేదు. మనుషుల్లో ఏ కొంచెమో మిగిలివున్న మానవత్వాన్ని సమూలంగా నాశనం చేసేందుకు పంచుతున్న విషంలా కన్పించింది.

రాచపుండులా పెరిగిన ఈ విష సంస్కృతికి ఏ సర్జన్ శస్త్రచికిత్స చేయాలి?

ఏ అనెస్తీషియా ఇవ్వాలి?

నా ఆలోచనలను భగ్నం చేస్తూ అప్పుడే పేజర్ మోగింది. మెసేజ్ చూశాను. మళ్ళీ ఇంకో ఆపరేషన్!

"ఇ.డి.హెచ్. పోస్టెడ్. ప్లీజ్ కాంటాక్ట్ జయా హాస్పిటల్..."

కారు భారంగా ముందుకు కదిలింది.

నా గుండెలో ఏ మూలో కలుక్కుమంది. ఆమెకు ఏం చెప్పను? ఎలా ఓదార్చను? అయిదు నిమిషాలపాటు తన కష్టసుఖాల గురించి కనుక్కున్నందుకు నన్నొక ఆత్మీయుడిలా భావించి, తన ఆర్తిని నాకు తెలుపుకొంది. దాపరికం లేకుండా తన దుఖాన్ని నా ముందుంచింది. బదులుగా ఆమెకు నేనేమీ చేయలేకపోవడమనేది నాకే చాలా ఇబ్బందిగా అనిపించింది.

## వాటర్ మార్క్

కరెన్సీ నోట్లమీద, స్టాంపుల మీద చూచాయిగా కనిపించేటట్లు ఏదో ఒక బొమ్మను, అక్షరాలను ప్రత్యేకమైన ఉద్దేశ్యంతో ముద్రిస్తారు. దాన్నే వాటర్‌మార్క్ అంటారు. కాగితం తయారయ్యేటపుడే యీ మార్కును ముద్రిస్తారు. ఈ మార్కులు వేయడం వల్ల కరెన్సీనోట్లను, స్టాంపులను యితరులు ముద్రించడానికి వీలుపడదు.

...........

ముద్రణా యంత్రాన్ని కనిపెట్టడం చరిత్రలోనే ప్రముఖఘట్టం. అన్ని విప్లవాలకూ అది పునాది.

-విక్టర్ హ్యూగో